క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

క్రోసూరు: క్రోసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రవికుమార్ బుధవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని, వివిధ శాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాల గురించి సమావేశంలో వివరిస్తారని అన్నారు. ప్రజా ప్రతినిధులు తప్పక సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పది మంది జూదరుల అరెస్ట్



అమరావతి: స్థానిక ఎస్ఆర్ఆర్ లాడ్జిలో పేకాట ఆడుతున్న పది మంది జూదరులపై అమరావతి పోలీసులు దాడి చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ అచ్చియ్య తెలిపిన సమాచారం ప్రకారం స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో బుధవారం మధ్యాహ్నం ఎస్ఆర్ఆర్ లాడ్జిపై ఆకస్మికంగా దాడి చేసి పది మంది పేకాటరాయుళ్లను, రూ.10,38,730 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, 2 కార్లు, 1 బైకును సీజ్ చేయటం జరిగింది. ఈ సందర్భంగా సీఐ అచ్చియ్య మాట్లాడుతూ పది మంది పేకాటరాయుళ్లతో పాటు లాడ్జి యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండల పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, బెట్టింగ్‌లు, పేకాటలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుపేద ఆర్యవైశ్య యువకుడికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉంటున్న ఆత్మకూరి వెంకటేష్ పట్టణంలోని బంగారం షాపులో గుమస్తాగా ఉంటూ జీవనం సాగిస్తున్న తరుణంలో ఇటీవల రోడ్డు ప్రమాదంకు గురి కావడం వలన నడవలేక ఇంటికే పరిమితమవ్వగా దాతల సహకారంతో రూ.18 వేలు నగదు, ఒక బియ్యం టిక్కి బుధవారం అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కొత్తూరి విశ్వేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, దేవతి శివప్రసాద్, బచ్చు రామ సుబ్బారావు, కాపుగంటి రమణ తదితరులు ఉన్నారు.


బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజశేఖర్



క్రోసూరు: క్రోసూరుకు చెందిన గనుపల్లి రాజశేఖర్ బహుజన సమాజ్ పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా బుధవారం నియమితులయ్యారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్‌కు, జిల్లా అధ్యక్షులు బూదాల బాబూరావుకు, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 నుంచి నియోజకవర్గంలో బీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల తరఫున పోరాడుతున్నట్లు పేర్కొన్నారు.

కల్తీ మద్యంపై అప్రమత్తంగా ఉండండి

ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



పెదకూరపాడు: కల్తీ మద్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదకూరపాడు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఇతర వ్యక్తుల ద్వారా మద్యం కొనుగోలు చేస్తే అది కల్తీ మద్యం కావచ్చని, ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వివాహాలు, శుభకార్యాలకు తక్కువ ధరకే ఎక్కువ మద్యం వస్తుందని చెప్పే మాటలు నమ్మవద్దన్నారు. లైసెన్సు దుకాణాలు కాకుండా ఇతరులు మద్యం విక్రయిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అప్రమత్తతతోనే నకిలీలకు చెక్

- పెదకూరపాడు నియోజకవర్గంలో నకిలీ విత్తనాల బెడద
- నష్టపోతున్న పత్తి, మిర్చి రైతులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతు పంటను పరిశీలిస్తున్న లాంఫాం శాస్త్రవేత్తలు (ఫైల్)

పెదకూరపాడు/అమరావతి: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు నేలలు పదునెక్కి ఖరీఫ్ సాగుకు పొలాలు దుక్కులు దున్ని.. విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా పత్తి, మిరప, కంది, మినుము, పరిమితంగా వరి, ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. రైతులు విత్తనాలు సమకూర్చుకునే పనిలో ఉన్నారు. ఈ సమయంలో పలు రకాల విత్తన కంపెనీల ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతుల అవసరాన్ని అవకాశంగా భావించి విత్తనాలను తక్కువ ధరలు ఆశ చూపి నకిలీలతో రైతులను నట్టేట ముంచే అవకాశం ఎక్కువగా ఉంది. రోజు రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచారార్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌లు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎంపికపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ రైతులకు పలు జాగ్రత్తలను సూచిస్తుంది. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 10 వేల ఎకరాలలో పత్తి, 2 వేల ఎకరాలలో మిర్చి, అలాగే కంది, మినుము సుమారు 2,500 ఎకరాలలో సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. రైతులు విత్తనాలు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు నియమ నిబంధనల ప్రకారం ఉన్నాయో లేవో సరిచూసుకుని కొనుగోలు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

గత ఏడాది నష్టపోయారు...

పెదకూరపాడు నియోజకవర్గంలో రైతులు అధికంగా మిర్చి, పత్తి సాగు చేస్తుంటారు. దాదాపు 25,000 హెక్టార్లలో పత్తి, 15,000 హెక్టార్లలో మిర్చి సాగు చేస్తారు. గత రెండేళ్లగా నియోజకవర్గంలో పత్తి, మిర్చి రైతులు నకిలీ విత్తనాల బారిన పడి తీవ్రంగా నష్టపోయారు. చీడపీడలతో దిగుబడులు లేక అల్లాడుతున్న రైతులకు నకిలీ బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్స్ లేని విత్తనాల దుకాణాలు రైతులకు వల వేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం కావడంతో నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం, ఆ తర్వాత మోసపోవడం షరా మామూలైంది.

అవగాహన కలిగి ఉండాలి



రైతులు విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోలులో అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో ప్రభుత్వ నిబంధనలు రైతులు పూర్తిగా తెలుసుకుని కొనుగోలు చేయాలి. వేరే ప్రాంతంలో అధిక దిగుబడి వచ్చిందని చెప్పే అక్రమార్కుల మోసపూరిత మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకూడదు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు రైతులు తప్పక పాటించాలి.

– అహ్మద్, మండల వ్యవసాయ అధికారి, అమరావతి

విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- వ్యవసాయ శాఖ లైసెన్స్ కలిగిన దుకాణాలు, డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా సంచిపై ఉందో లేదో చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు, ఎరువులు కొనకూడదు. అలాగే సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతం చూసుకోవాలి. ఎరువుల నాణ్యత, పురుగుమందులపై అనుమానం ఉంటే తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు సహాయంతో పరీక్షలకు పంపాలి.
- సంచుల్లో ఎరువుతోపాటు అన్యపదార్థాలు కనిపిస్తే దానిని కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను నెంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, రకం, బ్యాచ్ నెంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.
- వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు సూచనలు పాటించాలి.

లైసెన్స్‌లున్న షాపుల నుంచే మద్యం కొనుగోలు చేయాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐలు తులసి, విజయ్‌కుమార్



క్రోసూరు/అచ్చంపేట: అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేసి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన మద్యం దుకాణాల వద్ద మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని కోరారు. లైసెన్సు లేని వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అటువంటి మద్యం నకిలీది కావచ్చని అన్నారు. వివాహాలు, పార్టీలు లేదా ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యంను తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని, చెప్పి మద్యం ప్రియులను మోసం చేసే అవకాశం ఉంటుందన్నారు. అది నకిలీ మద్యం కావచ్చని, కొన్ని సందర్భాలలో మరణానికి కూడా దారితీయవచ్చన్నారు. కావున అటువంటి అనుమానిత వ్యక్తుల వద్ద నుండి మద్యం కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. అటువంటి వారు మీకు తారసపడితే వారి సమాచారం ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి 9440902480 లేదా క్రోసూరు ఎక్సైజ్ సీఐ 8309225378కి తెలపవచ్చన్నారు.

సత్తెనపల్లి: ఏపీ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్సు పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తుల (అనధికార వ్యక్తుల) నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అటువంటి మద్యం నకిలీది కావచ్చునన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యం తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పేవారు మిమ్మల్ని మోసం చేసే అవకాశం ఉందన్నారు. వారు సరఫరా చేసే నకిలీ మద్యం మీ ఆరోగ్యానికి హానిని కలిగించవచ్చని, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీయవచ్చునన్నారు. కావున అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు తెలియజేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ శాఖ సీఐ సత్తెనపల్లి నెంబర్-764922228కు కానీ, పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారికి కానీ తెలపాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు: ప్రజల సమస్యలు పరిష్కారమే మార్గంగా సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని లగడపాడు రోడ్డులో బుధవారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమస్యలను అడిగి తెలుసుకుని మై టీడీపీ యాప్‌లో స్వయంగా నమోదు చేశారు. తొలి అడుగులో భాగంగా వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ప్రవీణ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధి, స్మార్ట్ గ్రామాల దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. సంవత్సర కాలంలో పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.85 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేశామని రానున్న ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పెదకూరపాడు పాల కేంద్రం వద్ద రూ.40 లక్షలతో వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి అర్తిమల్ల రమేష్, షేక్ ముంతాజ్, మండల పార్టీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, షేక్ ముంతాజ్, సర్పంచ్ గుడిపూడి రాజు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పశువులు మృత్యి



అచ్చంపేట: విద్యుత్ షాక్‌కు రెండు పశువులు మృతి చెందిన ఘటన మండలంలోని కోనూరు, నిండుజర్ల గ్రామాలలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. కోనూరులో మచ్చ సీతారామప్రసాద్‌కు చెందిన పాడి గేదె తెగి కింద పడిన విద్యుత్ వైర్లకు తగలడంతో ప్రమాదం జరిగింది. ఈ గేదె ఖరీదు సుమారు రూ.50 వేల వరకు ఉండవచ్చని అంచనా. నిండుజర్ల గ్రామంలో కూడా విద్యుత్ స్తంభాలకు అమర్చని తీగలకు తగిలి వ్యవసాయానికి వినియోగించే లక్ష రూపాయల ఖరీదు చేసే ఎద్దు మృతి చెందింది. ఈ ఎద్దు చనిపోవడంతో దీనికి జతకట్టే మరో ఎద్దు గడ్డి కూడా మేయడం లేదని సంబంధిత రైతు వాపోతున్నారు. తక్షణమే తమకు పరిహారం ఇప్పించాలని వారు కోరారు. అంతకు ముందు ఒక గొర్రె కూడా విద్యుత్ షాక్ వల్ల మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం

ప్రమాదాలు జరిగిన రెండు గ్రామాలకు వెళ్లి పరిశీలించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. రెండు పశువులకు పోస్టుమార్టం చేసే ఏర్పాటు చేస్తున్నారు. పరిహారం అనేది నా పరిధిలో లేదు, ప్రయత్నం చేస్తాం.

– శివకోటిరెడ్డి, ఏఈ, విద్యుత్ శాఖ

కాంట్రాక్ట్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శనలో కార్మికులు

సత్తెనపల్లి: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మ రాజశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మేడి సత్యవతి, జల్లి రమేష్, చిలకా సునీత, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రాణాలు పోసే దేవుళ్లు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్



పీహెచ్‌సీ వైద్యులకు పుష్పగుచ్ఛాలను అందిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

క్రోసూరు: వైద్యులు అంటే ప్రజలకు నమ్మకం, ఒక విశ్వాసం అని, ప్రాణాలు పోసే దేవుళ్లని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ అన్నారు. డాక్టర్స్ డే పురస్కరించుకుని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరిచందన, డాక్టర్ రాంబాబు నాయక్‌లను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులకు రోగికి మధ్య బలమైన సంబంధం ఉంటుందన్నారు. సమాజంలో అత్యంత పవిత్రమైన వృత్తి వైద్య వృత్తని, ఆపద సమయంలో ఆపద్బాంధవుల్లా కనిపించే వైద్యులను ప్రజలు ఎంతగానో గౌరవిస్తారని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బి.సి. రాయ్ సేవలకు స్ఫూర్తిగా వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. వైద్యులను కేవలం సేవకులుగా చూడకుండా, వారి అవసరాలను, కష్టాలను గుర్తించాలని వారి ఆరోగ్యం, శ్రేయస్సు కూడా ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివుడు, స్టాఫ్‌నర్స్ అంజమ్మ, ఫార్మసిస్ట్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సుపరిపాలనలో తొలి అడుగు ప్రారంభం



సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో బుధవారం చేపట్టిన కార్యక్రమం మొక్కుబడిగా ప్రారంభమైంది. పట్టణంలోని 11వ వార్డు రఘురామ్ నగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ సుపరిపాలన ద్వారా ఇంటింటికీ కూటమి ప్రభుత్వం రెట్టింపు సంక్షేమం అందిస్తోందన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో మరింత నిధులు తీసుకువచ్చి సత్తెనపల్లిని అభివృద్ధి పథంలో నిలపడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రానున్న రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామన్నారు. సమస్యలు తెలుసుకొని వాటిని మై టీడీపీ యాప్‌లో స్వయంగా నమోదు చేసి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధిలో సత్తెనపల్లి ముందంజలో ఉండాలి

- సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం



ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే అభివృద్ధిలో సత్తెనపల్లి ముందంజలో ఉండాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి, పలు కీలక అంశాలపై సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా స్థాయిలో విజన్ ప్లాన్‌ను దృష్టిలో పెట్టుకొని నెల, మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదిలో చేరుకోవలసిన లక్ష్యాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలన్నారు. ప్రధానంగా పారామీటర్స్‌కు అనుగుణంగా అభివృద్ధి జరగాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజన్ కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా ఎమ్మెల్యే, కన్వీనర్‌గా ఆర్డీవో, కో కన్వీనర్లుగా ఎంపీడీవోలు ఉంటారన్నారు. ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసి అక్కడి నుంచే అభివృద్ధి కార్యక్రమాలపై మానిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల వారీగా అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. నకరికల్లు మండలంలో టూరిజంతో పాటు దేవరంపాడు, నకరికల్లు, గుత్తికొండ, చేజర్ల, కోటప్పకొండ ప్రాంతాల్లో ఆలయాల టూరిజం చేపట్టాల్సి ఉంటుందన్నారు. సత్తెనపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని అభివృద్ధి చేయాలని, ఎక్కువ మంది యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఆయా అంశాలపై చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంత్‌రెడ్డి, నలంద ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌కుమార్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు సూచనలిస్తున్న ఏవో కె.దేవదాసు



బలిజేపల్లిలో మాట్లాడుతున్న ఏవో వెంకట నర్సయ్య

నకరికల్లు: మిర్చి, కంది పంటలు సాగుచేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ యోజన ప్రయోజనాలు పొందేందుకు జూలై నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ కౌలుదారులు ధ్రువీకరణ పత్రాలతో వీఆర్వోలను సంప్రదించి కౌలు రైతు కార్డులు పొందాలన్నారు. వరిసాగు చేసే రైతులు బీమా పథకాలు పొందేందుకు ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పల్నాడు జిల్లా మేనేజర్ నాగయ్య, సత్తెనపల్లి సబ్ డివిజన్ కో ఆర్డినేటర్ గోపి, ఎంపీవో కె.హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

రాజుపాలెం: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ భూమిలో సరిపడా తేమ ఉన్నప్పుడే విత్తనాన్ని నాటాలని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాలలో పొందాలని చెప్పారు. ఏపీ సీడ్స్ వ్యవసాయ శాఖ ద్వారా వరి బీపీటీ 5204, జేజీఎల్ 368, కేఎన్ఎం 1638 రకాలు సబ్సిడీపై రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్లాభక్షి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి



కరపత్రాలు ఆవిష్కరించిన సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. క్రోసూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆమంచి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మురళి అధ్యక్షతన బుధవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులు వేతనాలు పెంచుతూ కనీస వేతనాన్ని అమలు చేస్తానని చెబుతూ, మరోపక్క కార్పొరేట్లకి అనుకూలంగా ప్రైవేటీకరణ పేరుతో కార్మికులకి పని భద్రత లేకుండా, కార్మిక వర్గం శ్రమను నిలువు దోపిడీ చేస్తుందని అన్నారు. ఇలాంటి విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిలక యేషియ్య, సీఐటీయూ క్రోసూరు మండల గౌరవాధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రాజుపాలెం ఎస్సీ కాలనీలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ



ముప్పాళ్లలో డెంగీ ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

రాజుపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ మాసోత్సవాలలో భాగంగా రాజుపాలెం ఎస్సీ కాలనీలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజనాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వ్యాప్తి ప్రారంభమవుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. నిల్వ ఉన్న నీటిపై దోమల వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి వసంతరావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, ఉషారాణి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో డెంగీ మాసోత్సవ ర్యాలీ

ముప్పాళ్ల: జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హోమియో వైద్యురాలు పద్మావతి, సూపర్‌వైజర్ దస్తగిరి, పీటర్‌డేమియన్, ఎస్కే ఉస్మాన్, జైనుల్లా, స్టాఫ్‌నర్స్ మధు, ఫార్మసిస్ట్ పావని, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఏఎన్ఎంలు భాను, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.